## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డెంకాడ: మండలంలోని అక్కివరం, చింతలవలస ఏపీఎస్పీ బెటాలియన్ సబ్‌స్టేషన్ల పరిధిలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు ఆ శాఖ ఈఈ జి.సురేష్‌బాబు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. విద్యుత్ నిర్వహణ పనుల కారణంగా ఏపీఎస్పీ బెటాలియన్, చింతలవలస ప్రాంతాలతో పాటు గొలగాం, మాన్యం, గంట్లాం ఎస్సీకాలనీ, డి.తాళ్లవలస ప్రాంతాలకు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు గమనించి, సహకరించాలని ఆయన కోరారు.




## ఇన్‌చార్జ్ డీఎస్పీగా గోవిందరావు

విజయనగరం క్రైమ్: డీఎస్పీ ఎం.శ్రీనివాస్ వేరే ప్రాంతానికి బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆయన స్థానంలో ఇన్‌చార్జ్ డీఎస్పీగా గోవిందరావును నియమించారు. ఈ విషయమై డీజీపీ కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు జారీ కాగా ఉదయం ఆయన బాధ్యతలు కూడా స్వీకరించారు.

## నిరసన

నెల్లిమర్ల: స్థానిక మొయిద జంక్షన్ వద్ద మున్సిపల్ కార్మికులు గురువారం నిరసన చేపట్టారు. తమ సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని, తమకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసే దిశగా నిర్ణయాలు తీసుకుని వెల్లడించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎ.జగన్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## హాస్టల్ విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలి

విజయనగరం టౌన్: హాస్టల్ విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని వీటీఅగ్రహారం బీసీ కాలనీలో ఉన్న బీసీ హాస్టల్‌ను ఆమె గురువారం సందర్శించారు. ఇదే హాస్టల్ విద్యార్థులు 29 మంది రాత్రి భోజనం తిని అస్వస్థతకు గురయ్యారన్న విషయం తెలుసుకున్న ఆమె..ఆ హాస్టల్‌కు వెళ్లి, అక్కడి పరిసరాలు, విద్యార్థులు పడుతున్న అవస్థలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు వారి ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, రాజకీయాలకు అతీతంగా పనిచేయాలని తమవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఆమె వెంట కార్పొరేటర్ శ్రీను తదితరులు ఉన్నారు.



విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

## సంక్షిప్తంగా...

### క్రీడాకారులకు అభినందనలు

విజయనగరం: రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన నగరానికి చెందిన క్రీడాకారులు కావ్య, భువనేష్‌లను డిప్యూటీ మేయర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కోలగట్ల శ్రావణి గురువారం అభినందించారు. రానున్న పోటీల్లోనూ విజయం సాధించి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

### బదిలీ

డెంకాడ: చింతలవలస ఐదో ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్ మల్లికా గార్గ్ బదిలీ అయ్యారు. ఆమెను ఏపీ టెక్నికల్ సర్వీసెస్‌కు బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

### ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

విజయనగరం టౌన్: విద్యార్థులంతా బాగా చదువుకుని, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని గైనకాలజిస్ట్ జి.సన్యాసమ్మ ఆకాంక్షించారు. స్థానిక మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో విద్యార్థుల సృజనాత్మకత వ్యక్తీకరణపై వర్క్‌షాపు గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె..విద్యార్థులంతా తమ జీవితంలో స్థిరపడేందుకు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని, వాటి సాధన దిశగా కృషి చేయాలని సూచించారు.

### నేడు, రేపు పెన్‌డౌన్

భోగాపురం: రాష్ట్ర దస్తావేజు లేఖరుల సంఘం పిలుపు మేరకు స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలోని దస్తావేజు లేఖరులంతా శుక్ర, శని వారాలు పెన్‌డౌన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఇదే విషయమై వారు సబ్‌రిజిస్ట్రార్ రామకృష్ణకు గురువారం వినతిపత్రం అందజేశారు. రిజిస్ట్రేషన్ శాఖలో ప్రభుత్వం కొత్త ప్రవేశపెట్టిన విధానాల వల్ల అటు ప్రజలకు, ఇటు దస్తావేజు లేఖరులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.

### ఇంటింటా సర్వే

విజయనగరం: ప్రతి ఆస్తి..పన్ను పరిధిలోకి తీసుకురావాలన్న ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నగరంలో ఇంటింటా సర్వే గురువారం చేపట్టారు. నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాల మేరకు సచివాలయ కార్యదర్శులు, నగరపాలక సంస్థ సిబ్బంది అంతా కలిసి బృందాలుగా ఏర్పడి సర్వే చేస్తున్నారు. అక్టోబరు 10లోగా సర్వే పూర్తి చేసి, నివేదికలను సమర్పించాల్సి ఉందన్నారు.

## మనువాద శక్తులను తరిమేయాలి

విజయనగరం గంటస్తంభం: మనువాద శక్తులను దేశం నుంచి తరిమివేయాలని సీపీఐ(ఎంఎల్) జిల్లా రాష్ట్ర కమిటీ కార్యదర్శి బుగత బంగారావు పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ(ఎంఎల్) కార్యాలయంలో విలేకరుల సమావేశం గురువారం నిర్వహించి, మాట్లాడారు. ఎన్నికల్లో బీజేపీ ఓట్ల చోరీకి ఎన్నికల సంఘం సహకరిస్తోందని ఆరోపించారు. దేశంలోని మతోన్మాదులు, వారిని పెంచి పోషిస్తున్న వారిని వ్యతిరేకించాలన్నారు. డిసెంబరు 6, 7 తేదీల్లో జరిగే పార్టీ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి బెహరా శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత న్యాయ సహాయంపై అవగాహన సదస్సు

విజయనగరంఫోర్ట్: స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఉచిత న్యాయ సహాయంపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. మానసిక రుగ్మతలు కలిగిన వారికి సాయం అందిస్తామని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎ.కృష్ణప్రసాద్ తెలిపారు. న్యాయసేవల అధికార చట్టంలోని సెక్షన్-12(డి) ప్రకారం మానసికంగా ఆరోగ్యం బాగాలేని, ఇతర వైకల్యాలున్న వ్యక్తులు..కేసు దాఖలు చేయడానికి, వాదించడానికి, ఉచితంగా న్యాయ సేవలు పొందేందుకు అర్హులన్నారు. మానసిక ఆస్పత్రి, నర్సింగ్ హోమ్‌లో నిర్బంధంలోని వారందరికీ ఇది వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ పద్మజ, డిప్యూటీ డీఎంహెచ్‌వో సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోండి

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఫ్లెక్సీల ఏర్పాటు వివాదంలో వాస్తవాలను గ్రహించి, తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ శెట్టి వీరవెంకటరాజేష్ డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి కమిషనర్, సహాయ కమిషనర్‌లు పల్లి నల్లనయ్య, కిల్లాన అప్పలరాజు, డీఎస్పీలను గురువారం కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విజయనగరంలో ఎన్నడూ లేని విధంగా కొత్త సంప్రదాయాలకు కొన్ని రాజకీయ పార్టీలు తెరలేపుతున్నాయన్నారు. ఎన్నో ఏళ్లుగా అన్ని రాజకీయ పార్టీలు వివిధ సందర్భాల్లో నగరంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకోవడం ఆనవాయితీగా వస్తోందని, అయితే కొత్తగా ఓ రాజకీయ పార్టీ ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలపై వేరొక పార్టీలు ఫ్లెక్సీలు పెట్టే వింత సంస్కృతి తీసుకురావడం ఎంతవరకు సమంజసమన్నారు. వారు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ఎవరో తొలగిస్తే కావాలనే వైఎస్సార్ సీపీ నాయకులపై ఆరోపణలు చేయడం తగదన్నారు. శాంతియుతంగా ఉన్న నగరంలో అలజడులు సృష్టించడానికి చేస్తున్న ప్రయత్నాలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇది కేవలం వైఎస్సార్ సీపీ నేతలను రెచ్చగొట్టే ప్రయత్నమేనని, వాస్తవ పరిస్థితులను అధికారులు తెలుసుకుని చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.బంగారునాయుడు, కార్పొరేటర్లు జి.వి.రంగారావు, బి.ఆనంద్, ఎస్.నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.



సహాయ కమిషనర్ అప్పలరాజుకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

## ధర్నా

విజయనగరంఫోర్ట్: స్థానిక విద్యుత్ భవన్ వద్ద విద్యుత్ ఉద్యోగులు గురువారం ధర్నా చేపట్టారు. ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులకు వైద్య సదుపాయం కల్పించాలని, పెన్షన్ అందివ్వాలని, ఎనర్జీ అసిస్టెంట్లను కొనసాగించి పదోన్నతి ఇవ్వాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, కాంట్రాక్టు కార్మికులకు డైరెక్ట్ పేమెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యుత్ జేఏసీ చైర్మన్ ఎస్.లక్ష్మణ్, నాయకులు అప్పలస్వామి, నిర్మల మూర్తి పాల్గొన్నారు.



















